క్లుప్తంగా

'గ్రామవెలుగు' నాట్యమండలి నాటకరంగ చరిత్రలోనే ప్రసిద్ధి

మునగాల: గ్రామవెలుగు నాట్యమండలి తెలంగాణ నాటకరంగ చరిత్రలోనే ప్రసిద్ధి పొందిందని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరీ గౌరిశంకర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రేపాల గ్రామంలో గ్రామవెలుగు నాట్యమండలి వ్యవస్థాపకుల్లో ఒకరైన మాచెర్ల రామయ్య సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బహుజన కళలను, సంస్కృతిని మనం కాపాడుకోలేకపోతే బహుజనుల కులాల అస్తిత్వమే కనుమరుగవుతుందన్నారు. గ్రామవెలుగు నాట్యమండలి ద్వారా చరిత్రాత్మకమైన వందలాది నాటకాలను ప్రదర్శించడంలో రామయ్య చేసిన కృషిని ఆయన కొనియాడారు. తొలుత రామయ్య చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు.

చింతలపాలెంలో వైద్యశిబిరం


వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, సిబ్బంది

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల కేంద్రంలో ఆదివారం మేళ్లచెరువు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న పలువురిని వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సీతామహాలక్ష్మి, డాక్టర్ సచిన్, సీహెచ్‌ఓ వినోద్‌కుమార్, సూపర్‌వైజర్ కుమారి, ఏఎన్‌ఎం నాగకళ్యాణి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివిధ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయాలి

మునగాల : రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని, నియోజకవర్గానికి ఒక స్టడీసర్కిల్ ఏర్పాటు చేసి భోజన, వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. నిరుద్యోగులే లక్ష్యంగా రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అదే విధంగా గ్రామీణ ప్రాంతాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని, నిరుద్యోగ యువతకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేసి భరోసాగా ఉండాలన్నారు.

పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి ఘన నివాళి


పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతగిరి : మండలంలోని గొండ్రియాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి నలమాద పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని పరామర్శించారు. వారిలో గొట్టిముక్కల బాబురావు, దేవాలయ కమిటీ చైర్మన్ ఏటుకూరి రమేష్, చుంచు మురళి, శేషగిరిరావు, బండ్ల మల్లయ్య, బట్ట వలరాజు, బొమ్మకంటి వెంకటప్పయ్య, పుల్లయ్య, ఏలూరి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ఇంటర్న్‌షిప్

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల మోడల్‌స్కూల్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆదివారం కోదాడలోని పలు దుకాణాల్లో ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా రిటైల్ ట్రేడ్‌కు సంబంధించి వ్యాపారంలో మెళకువలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సాయిఈశ్వరి మాట్లాడుతూ.. విద్యార్థులు దసరా పండుగ సెలవుల్లో 10రోజుల పాటు 80గంటలు వారికి దగ్గరలో ఉన్న రిటైల్ షాపులను సందర్శించి వ్యాపార మెళకువలు ప్రయోగపూర్వకంగా నేర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో వృత్తి విద్యా ట్రైనర్‌లు మధు, విజయరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ లారీని చింతలపాలెం పోలీసులు ఆదివారం పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి చింతలపాలెంకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని నిలిపి తనిఖీ చేయగా ఇసుకకు సంబంధించి ఎటువంటి వే బిల్లు లేకపోవడంతో లారీని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అదే విధంగా లారీడ్రైవర్ బడావత్ ఉపేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, ఇసుకను అక్రమంగా ఎవరు తరలించినా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

అడుగుకో గుంత.. ప్రజలకు చింత


మున్సిపాలిటీ పరిధిలోని ఓ వీధిలో గుంతలమయంగా మారిన సీసీరోడ్డు


భవానీనగర్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డు

- కోదాడలో మట్టి రోడ్లను తలపిస్తున్న సీసీ రహదారులు
- నాసిరకంగా చేపట్టడంతో ధ్వంసం

కోదాడ : పట్టణంలో సీసీ రోడ్లు అధ్వానంగా మారాయి. మట్టిరోడ్లను తలపిస్తున్నాయి. దీంతో పట్టణ ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. పాత సీసీ రోడ్లపైనే మున్సిపల్ అధికారులు మరోసారి సీసీ రోడ్లు వేయడం, అవి నాణ్యత లేకపోవడంతో అడుగుకో గుంత ఏర్పడింది. వాటిలో వర్షపు నీరు నిలిచి రోడ్డు మీద ప్రజలు నడవలేని దుస్థితి నెలకొంది. గత మున్సిపల్ ఎన్నికలకు ముందు కోదాడ మున్సిపాలిటీ పరిధిలో 3 కోట్ల 50 లక్షల రూపాయల నిధులతో హడావుడిగా వేసిన సీసీ రోడ్లు మొత్తం ఇలాగే తయారయ్యాయి. అధికారులు పట్టణ ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేసిన పన్నుల డబ్బులతో సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే ప్రస్తుతం మున్సిపాలిటీలో జరుగుతున్న పనులు కూడా ఈ కాంట్రాక్టర్లే చేపట్టడం. అధికారులు మాత్రం అది మా హయాంలో జరిగింది కాదంటూ తప్పించుకుంటున్నారు.

నాసిరకంగా చేపట్టడంతో..

పట్టణంలో ప్రతీ వీధిని కోట్ల రూపాయల నిధులతో సీసీ రోడ్డుగా మార్చారు. కొన్ని చోట్ల సీసీ మీద సీసీ రోడ్లు వేశారు. కానీ ఏ రోడ్డు చూసినా అడుగుకో గుంత దర్శనమిస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై నాసిరకంగా రోడ్లను వేయడంతో పాటు సీసీ రోడ్ల నిర్మాణంలో డస్ట్ వాడడంతో రోడ్లు గుంతమయంగా మారాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. కోదాడ మున్సిపాలిటీలో నలుగురు కాంట్రాక్టర్లదే రాజ్యంగా మారింది. ఏ పని ఎవ్వరూ దక్కించుకున్నా వీరే చేస్తారని.. థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ సెల్ ఉన్నా వారిని కూడా వీరు మచ్చిక చేసుకొని సీసీ రోడ్ల నిర్మాణంలో కనీస ప్రమాణాలు పాటించరని సమాచారం.

యథాతథంగా రోడ్లపై గాడులు..

పట్టణంలోని ప్రతి ఇంటి ముందు మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్స్ కోసం గాడులు తవ్వారు. వాటిని పూడ్చాల్సిన కాంట్రాక్టరు పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ అధికారులు మాత్రం పని పూర్తి అయినట్లు సర్టిఫికెట్ ఇచ్చి పంపారు. ఆ తరువాత ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో మున్సిపాలిటీ నిధులతో కొన్ని చోట్ల పూడ్చారు. ఆ పనులు కూడా నాణ్యతతో చేయకపోవడంతో గాడులు యథాతథంగా ఉన్నాయి. రోడ్లపై ప్రయాణిస్తుంటే నడుములు విరిగిపోతున్నంత పని అవుతుందని ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు.

గ్రామపంచాయతీ వేసిన రోడ్లే బాగున్నాయి



కోదాడ గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో వేసిన సీసీ రోడ్లు నేటికీ చెక్కు చెదరలేదు. కాని మున్సిపాలిటీ ఏర్పడిన తరువాత గడచిన 10 సంవత్సరాల కాలంలో సీసీ రోడ్ల కోసం దాదాపు 20 నుంచి 30 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఒక్కటంటే ఒక్క రోడ్డు కూడా బాగలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ ఇంటి ముందు 50 లక్షల రూపాయలతో వేసిన సీసీ రోడ్డు కూడా గుంతలమయంగా మారింది. ఈ రోడ్ల పరిస్థితిపై కలెక్టర్ విచారణ జరిపి బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి.

– కుదరవల్లి మోహనకృష్ణ, కోదాడ

కొనసాగుతున్న బతుకమ్మ సంబరాలు


నేరేడుచర్ల : విజయదుర్గ ఆలయంలో బతుకమ్మ సంబరాల్లో మహిళలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారం ఆవాస గ్రామం మిట్టగూడెంలో ఆదివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. 5వరోజు అట్ల బతుకమ్మ వేడుకల్లో భాగంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి అందరూ కలిసి ఆడిపాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, సారెడ్డి భాస్కర్‌రెడ్డి, నందిరెడ్డి సైదిరెడ్డి, హరిలీల బ్రహ్మారెడ్డి, శంభిరెడ్డి, పలువురు నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్‌రూరల్ : మిట్టగూడెంలో..

విజయదుర్గ ఆలయంలో..

నేరేడుచర్ల : బతుకమ్మ వేడుకలు ఆదివారం ఐదోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని విజయదుర్గ ఆలయంలో మహిళలు బతుకమ్మలతో ఆలయానికి తరలివచ్చి ఆడిపాడారు. అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకున్నారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డులలో ఆదివారం మహిళలు బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలోని మహిళలు బతుకమ్మలను ఒక చోట చేర్చి ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను సమీప చెరువులో నిమజ్జనం చేశారు.


హుజూర్‌నగర్ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు

హామీలను పూర్తిస్థాయిలో అమలుచేయాలి


నేరేడుచర్ల : సమావేశంలో మాట్లాడుతున్న పారేపల్లి శేఖర్‌రావు


పాలకవీడు : సమావేశంలో మాట్లాడుతున్న అనంతప్రకాష్

నేరేడుచర్ల : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన రుణమాఫీ, రైతుబంధు హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అరిబండి భవనంలో జరిగిన పార్టీ పట్టణ శాఖల మహాసభలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతాంగం, ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉన్న నమ్మకంతో ఓటు వేశారని, అధికారంలోకి వచ్చిన తరువాత తెలంగాణ ప్రజలను విస్మరించడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను తక్షణమే అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇండ్ల స్థలాలు, ఇండ్లు ఇవ్వాలని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా నిరుద్యోగ భృతిని కల్పించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకురాలు ఎం.రుద్రమ్మ, కుంకు తిరుపతయ్య, పార్టీ పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, ఆఫీజ్, ఎడ్ల సైదులు, మీనయ్య, రుద్రమ్మ, నీలా రాంమ్మూర్తి, సంపత్, శ్రీనివాస్‌రావు, శ్రీను తదితరులున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై దృష్టిపెట్టాలి

పాలకవీడు : కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలు మాని పాలనపై దృష్టిపెట్టాలని సీపీఎం మండల కార్యదర్శి కందగట్ల అనంతప్రకాష్ కోరారు. ఆదివారం మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో నిర్వహించిన పార్టీ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొద్ది నెలలుగా అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ కుంగుబాటు, ఫోన్‌ట్యాపింగ్, నేడు హైడ్రా అంశాలతో అధికార, ప్రతిపక్షాలు ఆరోపణ ప్రత్యారోపణలతోనే సాగిపోతుందని, ప్రజాపాలనను మరిచి ఒకరిపై ఒకరు విమర్శలతోనే కాలం వెలదీస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకిచ్చిన ప్రతీహామీని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు దొంగ వెంకటయ్య, దిద్దకుంట్ల పురుషోత్తంరెడ్డి, తొరిగొండ వెంకటేశ్వర్లు, సాముల నాగిరెడ్డి, కృష్ణారెడ్డి, సైదిరెడ్డి, కందుల సుధాకర్ రెడ్డి, సుందరయ్య, సైదులు, వెంకటయ్య, దిద్దకుంట్ల అమరారెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

నడిగూడెం : సీపీఎం బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని రామాపురంలో నిర్వహించిన గ్రామశాఖ మహాసభకు ఆయన హాజరైన మాట్లాడారు. అనంతరం పార్టీ రామాపురం గ్రామశాఖ కార్యదర్శిగా ఏనుగుల మోహన్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, నాయకులు దేవరంగుల వెంకటరెడ్డి, ఏనుగుల వీరాంజనేయులు, కొరట్ల శ్రీనివాస్, వీరయ్య, రాములు, వెంకటేశ్వర్లు, పవన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

అనంతగిరి : పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తినేని హనుమంతరావు అన్నారు. ఆదివారం మండలంలోని శాంతినగర్‌లో పార్టీ గ్రామ నిర్మాణ మహాసభ, ప్రజాసంఘాల కమిటీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. దేశంలో దోపిడీలేని సమాజం నిర్మించాలని, సమానత్వం కావాలి, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి, ఉచిత విద్యా, వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అందుకోసం పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగించాలన్నారు. అనంతరం పార్టీ గ్రామనిర్మాణ శాఖ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బద్దం కృష్ణారెడ్డి, నాగభద్రం, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మీరాన్‌బీ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా అమ్మవారు


చిలుకూరు : దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మహిళా భక్తులు కుంకుమపూజ, విశేష హారతులు, అన్నమయ్య భజన మండలి వారిచే భక్తిభజన సంకీర్తన వైభవంగా నిర్వహించారు. గుడి సేవ అనంతరం తీర్థప్రసాద వినియోగం గావించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రంగ బట్టాచార్యులు, మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్ లక్ష్మీ పార్వతి, కోట రాము, శంభులింగం, జనమంచి శ్రీనివాసశర్మ కళ్యాణి, బోనాల శ్రీనివాస్, చంద్రకళ, మాశెట్టి కృష్ణయ్య, బాచిమంచి కొండయ్య అనంతలక్ష్మి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గొవ రోజు ఆదివారం అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని నారాయణపురం కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొనసాగుతున్న దేవీశరన్నరాత్రి ఉత్సవాలు

మఠంపల్లి : దేవీశరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలో ఆదివారం కనకదుర్గమ్మవారిని భక్తులు త్రిపుర సుందరీదేవి అలంకారంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని మట్టపల్లి, మఠంపల్లి, యాతవాకిల్ల, తదితర గ్రామాల్లో భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు సోమయాజుల సూర్యనారాయణమూర్తిశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల పరిధిలోని కీతవారిగూడెంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారు గాయత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు జుట్టుకొండ సతీష్, గుండు హరీష్, ముత్తినేని లక్ష్మీనారాయణ, తెలపాటి శ్రీను, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


గరిడేపల్లి : పూజలు చేస్తున్న భక్తులు

మునగాల : మండలంలోని పలు గ్రామాల్లో దేవీనవరాత్రి ఉత్సవాలు నాల్గొవ రోజు ఆదివారం కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని శ్రీవేంకటకనకదుర్గ దేవాలయంతో పాటు శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయంలో దుర్గమాత శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో ఆయా ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


మఠంపల్లి : యాతవాకిల్లలో త్రిపుర సుందరీదేవి అలంకారంలో పూజలందుకుంటున్న అమ్మవారు

శ్రీబాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీవనదుర్గ దేవాలయంలో అమ్మవారు ఆదివారం బాలా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యావచనం, చండీపారాయణ సహస్రనామార్చనలు, కంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు, కుంకుమపూజ, సుహాసిని పూజలు, నివేదనం, నీరాజన మంత్రపుష్ప తీర్థ వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాధాకృష్ణమూర్తి, యాతవాకిళ్ల భానుకిరణ్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.


మేళ్లచెరువు : బాలా త్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారు


మునగాలలో శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా..


హుజూర్‌నగర్ : శ్రీలలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


హుజూర్‌నగర్ : ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు


గరిడేపల్లి : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని దొండపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. 2002-2006విద్యా సంవత్సరాలలో 6వ తరగతి నుంచి 10వతరగతి చదువుకున్న విద్యార్థులు అంతా పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చిన్ననాటి తమ జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు పూర్ణాచారి, సురేంద్ర మోహన్, బాబురావు, మారయ్య, విశ్వజ్ఞాచారి, కదిర బ్రహ్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, 50మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1988-89లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులు ఒకే చోట కలవడంతో యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడారు. పాఠశాల అభివృద్ధితో పాటు కలిసి చదువుకున్న విద్యార్థులకు ఎలాంటి ఆపద వచ్చినా అందరం అండగా ఉంటామన్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రామ్మూర్తి, చంద్రారెడ్డి, ఎస్.వెంకట్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్, ఆర్.వెంకటలక్ష్మి, అమృతారెడ్డి, పూర్వ విద్యార్థులు ఆర్.జగ్గారెడ్డి, ఎస్.విజయ, మారుతి, సీహెచ్.వీరయ్య, ఎండీ.జయరుద్దీన్, ముత్యాలు, సీహెచ్.మట్టయ్య, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, రమాదేవి, సావిత్రి, చంద్రకళ, మణెమ్మ, కవిత, పద్మ, మట్టారెడ్డి, సైదులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గృహోపకరణాలు దగ్ధం

అనంతగిరి: మండలంలోని కొత్తగోల్‌తండా గ్రామానికి చెందిన బాణోతు శారద ఇంటి ముందు వేప చెట్టుపై ఆదివారం పిడుగుపడడంతో గృహోపకరణాలు కాలిపోయాయి. ఆదివారం సాయంత్రం వర్షం కురుస్తుండగా శారద తన ఇంటి వెనుక మనువరాలు ఐశ్వర్యకు అన్నం తినిపిస్తోంది. అదే సమయంలో ఇంటి ముందు ఉన్న వేప చెట్టుపై భారీ శబ్దంతో పిడుగు పడింది. పిడుగు పడిన చోట ఇంట్లోని మీటర్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు కాలిపోవడంతో స్విచ్ బోర్డుల్లో మంటలు వచ్చాయి. దీంతో లైట్లు, టీవీ, ఫ్రిజ్ కాలిపోయాయి. అన్నం తింటూ ఫ్యాన్ రెగ్యులేటర్‌ను పట్టుకున్న శారద మనుమరాలు ఐశ్వర్యకు షాక్ తగిలి ఎడమ చేతికి స్వల్పంగా గాయమైంది. శారద ఇంటి పక్కనే ఉంటున్న బోడ పరశురాం, అతడి సోదరుని ఇంట్లోని ఫ్యాన్‌లు కాలిపోయాయి. మరో పక్కన ఉన్న చిట్లూరి పూర్ణచందర్‌రావు ఇంట్లోని కంప్యూటర్ కాలిపోయింది.

అకాల వర్షంతో నేలవాలిన వరిపంట


వర్షానికి నేలవాలిన వరిపంట

మునగాల : పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలతో ప్రతిఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన వరిపంట వర్షానికి నేలవాలడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని పలువురు రైతులు వాపోతున్నారు. ఆదివారం మండలంలో కురిసిన అకాల వర్షానికి ముకుందాపురం గ్రామానికి చెందిన ముస్కుల సైదిరెడ్డికి చెందిన 10ఎకరాలలో సాగుచేసిన వరిపంట పూర్తిగా నేలవాలింది. నెలరోజుల్లో పంట చేతికి వస్తుందన్న తరుణంలో ఈ వర్షం తనకు తీవ్రనష్టాన్ని మిగిల్చిందని సైదిరెడ్డి వాపోయారు.